# గురురాఘవేంద్ర జలాశయాలను పూర్తి చేస్తాం

ఎమ్మిగనూరు, జులై 31 (న్యూస్‌టుడే): ఎమ్మిగనూరు నియోజకవర్గ బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి పట్టుబట్టి గురురాఘవేంద్ర జలాశయాన్ని మంజూరు చేయించుకున్నారని రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం రాత్రి నాగులదిన్నెలో 'మీకోసం' యాత్రలో భాగంగా జరిగిన సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 1999లో మొదట రూ.60 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేయించుకొని గురురాఘవేంద్ర జలాశయానికి పునాది వేయించిన ఘనత బీవీదేనని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా రూ.లక్ష కోట్లతో చేపడుతున్న నిధులు అవినీతికి చిహ్నంగా మారాయని అన్నారు. గురురాఘవేంద్ర జలాశయ పనులే దీనికి నిదర్శనమని అన్నారు. దాదాపు 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో రూ.180 కోట్లతో చేపట్టిన జలాశయ పనుల్లో అడుగడుగునా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇప్పటివరకు పది వేల ఎకరాలకు కూడా నీరందించడం లేదని దుయ్యబట్టారు. నాణ్యత లేని నిర్మాణం వల్లబసలదొడ్డి జలాశయానికి గండి పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారని, సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బీవీ చేసిన అభివృద్ధి పనులు మినహా ఇప్పుడు కొత్తగా ఒక్కటీ లేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బీవీ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కె.ఇ. కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి కె.ఇ.ప్రభాకర్, తెదేపా నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గుడిసె కృష్ణమ్మ, బి.టి.నాయుడు, ఎమ్మెల్సీ మసాల పద్మజ, కోవెలకుంట్ల, ఆత్మకూరు బాధ్యులు ఎర్రబోతుల వెంకటరెడ్డి, బుడ్డా సీతారామిరెడ్డి, నాయకులు బంగి అనంతయ్య, బాల నాగిరెడ్డి, సీతారామిరెడ్డి, రుద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.



వంతెన వద్ద నిరీక్షిస్తున్న కార్యకర్తలు



గొర్రెల కాపరుల ఉత్సాహం

### కోలాహలం

**నందవరం:** చంద్రబాబుకు నాగులదిన్నె వద్ద గురువారం సాయంత్రం ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగున పూలవర్షాలు కురిపిస్తూ మహిళలు హారతులు ఇచ్చారు. వేలాది మంది ర్యాలీ నిర్వహిస్తుండగా చంద్రబాబు మీకోసం యాత్ర సాగింది. నాగులదిన్నె సర్కిల్ వద్ద చంద్రబాబుకు రైతు నాగలి ఇచ్చి ఎడ్లబండిపై ఎక్కించారు. అనంతరం తప్పెట్లు, వాయిద్యాల మధ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు నాగరాజుగౌడు, కాశింవలి, బాపురం హనుమంతరెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### నందవరంలో రోడ్‌షో

**నందవరం:** నాగులదిన్నె నుంచి బయలుదేరిన మీకోసం యాత్ర నందవరం, ముగతి గ్రామాలకు చేరుకుంది. నందవరంలో ఊరి చివర నుంచి చంద్రబాబు రోడ్డుషోలో పాల్గొన్నారు. గ్రామస్థులు తయారుచేసిన నాగలితో ఎద్దులబండిపై చంద్రబాబు పాల్గొన్నారు. మేళతాళాలు, బీరప్పడోళ్లు, తప్పెట్లతో నాయకులు ఘనస్వాగతం పలికారు. స్థానిక నాయకులు నాగరాజుగౌడు, మాధవరావు దేశాయి. మస్తాన్‌సాబ్, పెద్దరాముడు, ముగతి ఈరన్న గౌడు, సంజీవరాయుడు, రామరాజు, తుకారాం రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు చంద్రబాబుకు పూలమాల వేసి స్వాగతం పలికారు.

### ఆకట్టుకున్న బంగి అనంతయ్య ప్రదర్శన

మీ కోసం యాత్రకు వచ్చిన కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పసుపురంగు దుస్తులతో తల పాగా ధరించి చేతిలో పార్టీ జెండాతో ఆకర్షణగా నిలిచారు.